ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 03 మార్చి , 2026 | పేజీలు : 06

సాదాసీదాగా ఆర్‌టిసి బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్సీ సత్యం

ప్రజాపక్షం/మునుగోడు: ప్రజా ప్రతినిధులంటే విలాసవంతమైన వాహనాలు,కాన్వాయ్‌లు,భద్రతా సిబ్బంది అనేది సాధారణంగా కనిపించే దృశ్యం. కానీ సిపిఐకి చెందిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాత్రం ఆ పరంపరను విరమించి,సాధారణ ప్రజల మాదిరిగానే ఆర్‌టిసి బస్సులో స్వయంగా టికెట్ తీసుకుని ప్రయాణించడం విశేషంగా నిలిచింది. ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం లింగవారిగూడం గ్రామస్తుల నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని వినతి పత్రం స్వీకరించారు.గ్రామ ప్రజల ఇబ్బందులను గమనించిన ఆయన, వెంటనే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడి ఆ గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయించారు.ఈనేపథ్యంలో సోమవారం మునుగోడు మండల మార్గంగా లింగవారిగూడం కు వెళ్లే ఆర్‌టిసి బస్సులో ఎమ్మెల్సీ సత్యం సాదాసీదాగా ప్రయాణించారు. సుమారు 20 కిలోమీటర్ల మేర సాధారణ ప్రయాణికుడిలా టికెట్ తీసుకుని బస్సులో కూర్చుని ప్రయాణించడం ప్రయాణికులను ఆశ్చర్యానికి గురి చేసింది.

విశ్వశాంతి కేంద్రంగా బుద్ధవనం

బుద్ధవనంలో మూడవ బుద్ధధమ్మ యాత్ర ముగింపులో మంత్రులు జూపల్లి,వివేక్

ప్రజాపక్షం/నందికొండ : బుద్ధవనాన్ని విశ్వశాంతి కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర సాంస్కృతిక,పర్యాటక,ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కళారూపాలు, వివిధ మాధ్యమాల ద్వారా బుద్ధుని బోధనలను గ్రామ గ్రామానికి తీసుకెళ్తామని తెలిపారు.సోమవారం నల్లగొండ జిల్లా ,నాగార్జునసాగర్ సమీపంలోని బుద్ధ వనంలో మూడవ బుద్ధధమ్మ యాత్ర ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక ఉపాధికల్పన, శిక్షణ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తో కలసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి వివిధ దేశాల నుండి హాజరైన బౌద్ధ బిక్షువులను ఉద్దేశించిన మంత్రి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణ బుద్ధుని ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతుందని అన్నారు. బుద్ధుని బోధనలైన కరుణ, ప్రేమ, దయ వంటి వాటిని ప్రజల హృదయాలలో తిరిగి నింపేందుకు బౌద్ధ బిక్షువులు నెలరోజుల పాటు కర్ణాటకలోని కాలబురిగి నుండి తెలంగాణలోని బుద్ధ వనం వరకు నిర్వహించిన పాదయాత్ర సందేశం ఇచ్చిందని అన్నారు. బుధవనాన్ని వరల్డ్ క్లాస్ హెరిటేజ్ కేంద్రంగా తీర్చి దిద్దుతామని, పబ్లిక్ ప్రైవేట్ బాగ స్వామ్యం తో ఆధునిక సాంకేతికతను ఉపయోగించి గ్లోబల్ బుద్ధిస్ట్ కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే బుధవనాన్ని విశ్వశాంతి కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. దమ్మ యాత్ర ప్రారంభం మాత్రమే అని, రాబోయే రోజుల్లో బుద్ధ వనం ప్రపంచానికే వెలుగునిస్తుందని అన్నారు. రాష్ట్ర కార్మిక ఉపాధికల్పన, శిక్షణ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ మనిషి సాధారణ జీవితాన్ని గడిపేందుకు బుద్ధుని బోధనలు మార్గదర్శకంగా నిలుస్తాయని, శాంతియుతంగా ,ఆశావాద దృక్పథంతో జీవితాన్ని కొనసాగించేందుకు బుద్ధుని బోధనలు ఉపకరిస్తాయని తెలిపారు బుద్ధవనం రాష్ట్రంలోనే కాక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గొప్ప సాంస్కృతిక వారసత్వ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉందని, బుద్ధవనాన్ని టూరిజం మాన్యుమెంట్ గా విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు.స్థానిక శాసన సభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి, బుద్ధ సాంస్కృతిక అంబాసిడర్ గగన్ మాలిక్ బుద్ధ వనం స్పెషలాఫీసర్ మల్లేపల్లి లక్ష్మయ్య, ఆశ్రయ ఫౌండేషన్ అధ్యక్షులు సిద్ధార్థ్, థాయ్ ల్యాండ్ బౌద్ధ సన్యాసులతో పాటు వచ్చిన శ్రీలోక్ కుంతూ , విశ్రాంత ఐపీఎస్ అధికారి ఆంజనేయ రెడ్డి, తదితరులు మాట్లాడారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

అంతరాలు లేని ఆనంద కేళి.. అనురాగ రంగుల హోలీ!

ప్రజాపక్షం/నకిరేకల్ : వసంతం వచ్చిందంటే ప్రకృతి నవ్వుతుంది. చిగురుటాకుల చప్పుడు గాలిలో మోగుతుంది. పూల పరిమళం పుడమిని పరవశింపజేస్తుంది. అలాంటి మధుర వేళలో మనుషుల మనసుల్లోనూ కొత్త వెలుగు పుడుతుంది. మనసు మంచిదైతే మార్గం ముద్దుగా ఉంటుంది" అన్నట్లుగా, మనసుల మధ్య ఉన్న గోడలను కూల్చి, అనురాగాలకు రంగు లద్దే పండుగ హోలీ. ఇది కేవలం రంగుల సంబరం కాదు మనుషుల్ని ఒక్కటిగా నిలబెట్టే మానవత్వ మహోత్సవం.సమాజం గీసుకున్న కుల,మత, ఆర్థిక భేదాల గీతలు హోలీ రోజు కనుమరుగైపోతాయి. రంగు పూసిన ముఖాల్లో హోదాలు కనిపించవు. అక్కడ ధనికుడుపేదవాడు అనే తేడా లేదు కలిసివుంటే కలదు సుఖం అన్న సామెత సాక్షాత్కారమయ్యే రోజు ఇదే.ప్రేమ అనే ఒకే వర్ణంలో మనుషులు కలిసిపోయే అరుదైన దృశ్యం హోలీ అందిస్తుంది.

పగలు దహనం.. స్నేహాలకు నాంది : హోలీ అంటే నీటిలో రంగులు కలపడం మాత్రమే కాదు; మనసులోని కల్మషాన్ని కడగడం. కోపాన్ని ఎరుపులో కలిపి దూరం చేయాలి. శాంతిని తెలుపులో ఆవిష్కరించాలి. ఆత్మీయతను పసుపు వర్ణంలా పరచాలి.పగతో పెరిగేది పాడు, ప్రేమతో పెరిగేది బంధం ఈ సత్యాన్ని గుర్తు చేసే వేడుక హోలీ. హోలికా మంటల్లో పాత పగలను దహనం చేసి, కొత్త స్నేహాలకు రంగుల సాక్షిగా నాంది పలకాలి.

ప్రకృతి స్నేహంతో పండుగ : సహజ రంగులతో పర్యావరణ హితంగా జరుపుకునే హోలీ ఆరోగ్యానికీ ఆనందానికీ ప్రతీక. ప్రతి రంగు చుక్కా ఒక చిరునవ్వు కావాలి. ప్రతి ఆలింగనం ఒక అనుబంధానికి బలం కావాలి. రంగుల మధ్య మనిషిలోని సమతాభావం మరింత బలపడాలి.మనసులోని మలినాన్ని కడిగి, మమకారాన్ని నింపుకుందాం. కులమతాలకు అతీతంగా, ఆర్థిక అసమానతలకు అతీతంగా,అందరమూ ఒక్కటే అన్న భావనతో హోలీని సామాజిక ఐక్యతా వేదికగా మలుచుకుందాం.

అక్రమ ఇసుక రవాణా... ట్రాక్టర్ల పట్టివేత

కేసు నమోదు

ప్రజాపక్షం/ఆలేరు : ఆలేరు పట్టణ కేంద్రంలోని ఆలేరు పెద్ద వాగులో నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లను పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ యాలాద్రి తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు పట్టణానికి చెందిన కొమ్ము కమలాసన్, గంగుల చంద్రశేఖర్, ఎర్రం నరసింహారెడ్డి, చిట్ట బోయిన మహేష్‌ల వ్యక్తి గత ట్రాక్టర్లు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నందున నాలుగు ట్రాక్టర్‌లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసామని సీఐ యాలాద్రి తెలిపారు.

ఖాళీ అవుతున్న ఆలేరు పెద్ద వాగు బిక్కేరు వాగులు

ఆలేరు నియోజకవర్గంలోని ఆలేరు, రాజాపేట మండలంలోని నదులు వాగులు, వంకల్లో ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఆలేరు పెద్ద వాగు, బిక్కేరు వాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇసుక వ్యాపారులు అక్రమంగా ఇష్టం వచ్చిన ప్రాంతాల్లో జేసీబీలతో తవ్వకాలు చేసి ట్రాక్టర్ ల ద్వారా ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు ఇసుకాసురులు. రెవెన్యూ, పోలీసు శాఖ మధ్య సమన్వయ లోపం ఉండడంతో ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొందరు పగలు ఇసుక తవ్వకాలు చేసి, నిర్మానుష్య ప్రాంతంలో మరియు వాగు సమీప పరిసరాల్లో అక్రమనిల్వ చేసి రాత్రి సమయంలో లారీలు, టిప్పర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. యథేచ్ఛగా ఇసుక దోపిడీ చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జేసీబీ ల సహాయంతో ఇసుక తవ్వకాలు చేసి అక్రమ రవాణా చేస్తున్నారు. అధికార పార్టీ నేతల మద్దతు ఉండడంతో ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతున్నది.

ఆలేరు, రాజాపేట మండలాల్లో జోరుగా ఇసుక అక్రమ రవాణా.....

ఆలేరు మండలం లోని కొలనుపాక, మందనపల్లి, మంతపురి, సాయిగూడెం, కొల్లూరు, గొలనుకొండ, రాజాపేట మండలం లోని బేగంపేట్, రేణికుంట, చల్లూరు, రఘునాథపురం, లక్ష్మ కృపల్లి, సోమారంతో పాటుగా ఆలేరు రాజాపేట మండలాల్లో ఎక్కువగా ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ. 4 వేల నుండి 5 వేల వరకు బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారు.

ఇసుక దోపిడీ ని అడ్డూకునే వారే లేరా!

ఆలేరు నియోజకవర్గంలోని వాగులు, వంకల్లో ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇసుక మాఫియా.. అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలేదని. ఇసుక వ్యాపారులు అక్రమంగా ఇష్టం వచ్చిన ప్రాంతాల్లో భారీ వాహనాల సహాయంతో తవ్వకాలు చేసి ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ, పోలీసు శాఖ మధ్య సమన్వయ లోపం ఉండడంతో ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇకనైనా ఇసుక మాఫియా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి అక్రమ ఇసుక రవాణా జరగ కుండా చేసి భూగర్భ జలాలు అడుగంటకుండా చూడాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్త్రీ శక్తి భవనానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/మునగాల: మండల పరిధిలోని నర్సింహా పురం గ్రామంలో సుమారు పది లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే స్త్రీశక్తి భవనానికి సర్పంచ్ వేమూరి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మహిళ సాధికారిత సాధించడం కోసం గ్రామంలో చేపడు తున్న స్త్రీ శక్తి భవనం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రెడ్డబో యిన ప్రశాంత్, పచ్చిపాల అశ్విని, వీరబోయిన నరేష్, మీసాల బిక్షం, రేవూరి కళ్యాణి, పంచాయతీరాజ్ ఎఇ వసంత పాల్గొన్నారు.

జాతీయస్థాయి పరీక్షపై అవగాహన సదస్సు

ప్రజాపక్షం/కోదాడ: కోదాడ పట్టణంలోని కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేట్ ఆప్టి ట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) జాతీయ స్థాయి పరీక్షపై సోమవారం విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్లపల్లి గాంధీ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఢిల్లీకి చెందిన ఐఐటి ప్రొఫెసర్ గూహ న్‌చౌదరి మాట్లాడుతూ ఈ గ్రాడ్యుయేట్ అప్టిట్యూడ్ టెస్ట్ భారత దేశంలో నిర్వహించే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష అని తెలిపారు. ఈ పరీక్ష ద్వారా ఎంటెక్, ఫిహెచ్‌డి ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్య క్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ నాగార్జునరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పుష్పలత, వివిధ విభాగాధిప తులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొబైల్ షాప్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : మొబైల్ షాప్స్ అసో సియేషన్ నూతన కమిటి మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటి సభ్యులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కిరాణా ఫ్యాన్సీ మర్చంట్స్ వేదికగా జరి గిన ఎన్నిక కార్యక్రమంలో కమిటి అధ్యక్షుడిగా గౌస్, సెక్రటరీగా సూరి, కోశాధికారిగా జయప్రసాద్‌లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటి సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి మూడోసారి కూడా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల వారు సభ్యులం దరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల పరిశీలకలుగా బండి శ్రీనివాస్, జలగిరి నాయుడు, బత్తుల శశి, శ్రవ ణ్‌లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో నాని, నరేష్, రమేష్, మీరా, రఫీ, శ్రీకాంత్, బద్రి, విజయ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అభివర్ణించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వ ర్యంలో దివంగత శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా పని చేసిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడ డంలో విశిష్ట పాత్ర పోషించారన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకరమైన విషయమన్నారు. గ్రామాభివృద్ధి, బల హీన వర్గాల సంక్షేమం, ప్రజల సమస్యల పరిష్కా రంలో ఆయన కృషి విశేషమైనదన్నారు. ఈ కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, ఆర్‌డిఓ వేణుమాధవ్, డివైఎస్‌ఓ వెంకట్‌రెడ్డి, జడ్‌పి సిఈఓ శిరీష, డిఎంహెచ్‌ఓ వెంకటరమణ, డిఎంఓ నాగే శ్వర శర్మ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తాం

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సూర్యాపేట మున్సి పాలిటిని రాష్ట్రంలో ఉత్తమ మున్సిపాలిటిగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆల యంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదత లక్ష్మాదితో పాటు వివిధ గ్రామాలలో గెలిచిన ఆర్యవైశ్య సర్పం చులను, వార్డు కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను పోటు చేసిన 46వ వార్డులో అత్యధిక మెజార్టీతో గెలిపించిన వార్డు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నడూ లేని విధముగా సూర్యాపేట పట్టణంలో 48 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ 41వేల ఓట్లు సాధించడం ఒక రికార్డు అన్నారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ తరపున ప్రజా ప్రతినిధులకు సన్మానించడం అభినందనీయమ న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మత్స్యశాఖ చైర్మన్‌గా చామకూరి దశరథ

ప్రజాపక్షం/గరిడేపల్లి: ఎట్టకేలకు గరిడేపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘ చైర్మన్‌గా చామకూరి దశరథను సోమవారం డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకో వడం జరిగింది. మండల కేంద్రంలోని మత్స్య పారి శ్రామిక సహకార సంఘానికి గత మూడు సంవత్స రాల క్రితం ఎన్నికలు జరగగా కొన్ని రాజకీయ విభే దాల కారణాల వల్ల చైర్మన్ ఎన్నిక వాయిదా పడటం జరిగింది. అప్పటి నుండి నేటి వరకు మత్స్య పారిశ్రా మిక సహకార సంఘానికి డైరెక్టర్లు గెలిచిన చైర్మన్, వైస్ చైర్మన్, ప్రధాన కార్యదర్శి లేకుండా కాలం సాగింది. ఎట్టకేలకు సోమవారం డైరెక్టర్లు ఓకే తాటి పై వచ్చి చైర్మన్‌గా చామకూరి ధశరథ, వైస్ చైర్మన్, ప్రధాన కార్యదర్శిలను, ఎనిమిది మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నేడు జిల్లా కేం ద్రంలోని మత్స్య పారిశ్రామిక కార్యాలయంలో అధి కారికంగా దశరథను ఎన్నుకోవడం జరిగింది. డిఎ ఫ్‌వో బాణోతు నాగులు నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, ప్రధాన కార్యదర్శులకు నియామకప త్రంతో పాటు బైలాను అధికారికంగా అందించారు. వైస్ చైర్మన్‌గా ప్రధాని వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా కీసర పుల్లయ్య, డైరెక్టర్లు సంతు, ప్రధాని అమ రయ్య, మేడారపుసైదులు, ప్రధాని వీరస్వామి, మత్స్యశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్‌పి భూములను కాపాడాలి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : మిర్యాలగూడ పట్ట ణంలోని ఎన్ఎస్‌పి అధీనంలోని భూములు ,భవనా లలో ఆక్రమణలకు తొలగించి, ప్రభు త్వ కార్యాలయ ములు ఏర్పాటు చేయాలని ఆర్ టి ఐ మానిటరింగ్ కమిటీ సభ్యులు, వ్యవస్థాపక అధ్యక్షులు సమాచార హక్కు వికాస సమితి చైర్మన్ ఎర్రమాద కృష్ణారెడ్డి కోరారు. సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యా లయంలో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం అద్దె భవనాల్లో నిర్వహిస్తు న్న ప్రభుత్వ కార్యాలయాలను ప్రభుత్వ స్థలంలో, భవ నాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసిన ట్లుగా తెలుస్తుందని అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాలను తక్షణమే ఖాళీ చేసి ప్రభుత్వ స్థలాల్లో భవనాల్లో ఏర్పాట్లు చేయాలని అన్నారు. వందల కోట్ల విలువైన ఎన్ఎస్‌పి భూములను,భవ నాలను కాపాడి ప్రజలకు ఉపయోగపడేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ కి వినతి పత్రం ఇచ్చి న వారిలో రామలింగయ్య,బి సైదులు గౌడ్,బి.రామకృష్ణ,బాలు తదితరులు ఉన్నారు.

చట్టవిరుద్ధంగా వైద్య సేవలు అందిస్తే చర్యలు తప్పవు

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : జిల్లాలో చట్టవిరుద్ధంగా వైద్య సేవలు అంది స్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి వెంకటరమణ తెలిపారు. సూర్యాపేట పట్టణంలోని ఆపిల్ డయాగ్నస్టిక్స్ అండ్ స్కాన్ సెంటర్‌కు సంబంధించి తప్పుడు విద్యాఅర్హతలు సమర్పించడం, చట్టవిరు ద్ధంగా సోనాలజిస్ట్‌గా ప్రాక్టీస్ చేయడం వంటి అంశాలపై జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటి సమగ్ర విచారణ జరిపి అర్హులు కాదని నిర్ధారిం చిందన్నారు. నివేదిక ఆధారంగా తేది.28.02.2026న సదరు స్కాన్ సెంటర్‌ను సీజ్ చేసినట్లు గుర్తు చేశారు. చట్టాల ఉల్లంఘనలకు సంబంధించి డాక్టర్ కిరణ్ కుమార్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య శాఖ అధికారులు సూర్యాపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి దుద్దిళ్ళ శ్రీపాదరావు

ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి దుద్దిళ్ళ శ్రీపాదరావు అని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాద రావు జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలసి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో శోభారాణి, జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, జిల్లా గ్రామీనాభివృద్ధి అధికారి నాగి రెడ్డి, ఏఓ అంజిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకే ఉద్యోగావకాశాలు ఎక్కువ

ప్రజాపక్షం/కోదాడ: గ్రామీణ ప్రాంత విద్యార్థులకే ఉద్యోగ అవకా శాలు ఎక్కువగా ఉన్నాయని హైద్రాబాద్‌లోని గచ్చిబౌలి సిఐ జాల ఉపేందర్‌రావు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని కెఆర్ ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో టిఎస్‌కెసి, చరిత్ర విభా గాల ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీ పరీక్షల విజయం సాధిం చడం ఎలా? అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్ర మంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజేతలుగా మారే ప్రతి ఒక్కరికి పుస్తక జ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అవసరం ఎంతైనా ఉందన్నారు. సైన్స్ ఇంజనీరింగ్ వంటి టెక్నాలజీ కోర్సుల కన్నా సామాజిక శాస్త్రాలు చదివిన విద్యా ర్థులకు గ్రూప్1, గ్రూప్2 వంటి ఉద్యోగాల్లో ఎక్కువగా ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. నాగిరెడ్డి, టిఎస్ కెసి కోఆర్డినేటర్ సైదులు, డాక్టర్ బి.సైదిరెడ్డి, డాక్టర్ నిర్మలకు మారి, ప్రాన్సిస్, ఎస్ఎం రఫీ, సైదులు, రాజు పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వమే మానవ వికాసానికి మూలం

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : ప్రశ్నించడం అలవాటు చేసుకు న్నప్పుడే మనిషిలో ఆలోచనలు పుడతాయని, ఆ ఆలోచనలే మానవ పరిణామానికి, అభివృద్ధికి పునాదులు వేస్తాయని 30ఎం జెనోమిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో , కోఫౌండర్ డాక్టర్ బి.బెనెట్ బోస్కో దాస్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం, దేశ్ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం' ఎంట్రప్రెన్యూర్షిప్ సెల్ ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు కేవలం చదువులోనే కాకుండా సొంతంగా అంకుర సంస్థలన స్థాపించడానికి అవసరమైన నైపుణ్యాలను ప్రోత్సాహాన్ని అందించే కేంద్రంగా ఈసెల్ పని చేయనుందనీ పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో ఆయా విభాగాల డీన్లు, డైరెక్టర్లు, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) : మండలంలోనీ కొర టికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. సర్పంచ్ సుశీల హనుమంత్ పాల్గొని మాట్లాడుతూ ఒక్క రోజు అధికారులుగా ప్రజా ప్రతినిధులుగా ఉపాధ్యాయులుగా వేషధారణ చేసిన విద్యార్థులు నిజ జీవితంలో కూడా ఉన్నత స్థానాలలో స్థిర పడాలని కోరారు.

స్వపరిపాలన దినోత్సవం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని శ్లోక పాఠశాలలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు జిల్లా కలెక్టర్‌గా, జేసీగా, డీఈవోగా, ఎంఈవోగా, కరస్పాండెంట్‌గా, డైరెక్టర్స్, ప్రిన్సిపాల్‌గా, ఉపాధ్యాయులుగా, ఉన్నతాధికారులుగా చక్కని పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కట్టా అనిత, ప్రిన్సిపాల్ ఆర్.రాధిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలో చైతన్య నగర్‌లో గల శిష్య పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సీఎంగా, మినిస్టర్లుగా, ఆఫీస ర్లుగా, హెచ్ఎంగా, ఉపాధ్యాయులుగా పాత్రలను పోషించి చక్కటి ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అలుగుబెల్లి శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య కల్యాణ మహోత్సవం

ప్రజాపక్షం/మోతె : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య కళ్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కోదాడ నియోజక వర్గంలో మోతె మండల కేంద్రంలో సుమారు 20 సంవత్సరాల నుండి జరిగే జాతరను అభివృద్ధి చేయడానికి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సహకారంతో కృషి చేస్తామన్నారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలుగు వీరన్న, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సామ పెద్ద వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పోషక ఆహార దినోత్సవం

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతినెల నిర్వహించే పోషకహార దినోత్సవ అవగాహన సదస్సు, పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 16వ వార్డు కౌన్సిలర్ చిట్టిపోతుల భద్రమ్మ, 17వ వార్డు కౌన్సిలర్ బెల్లంకొండ సంధ్యరాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిరోజు ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా అందించే ఒక పూట భోజనము, ప్రతి ఒక్క గర్భిణి, బాలింత తప్పని సరిగా కేంద్రంలోనే స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సోమ్మ, అంగన్‌వాడీ టీచర్లు ఆకుల రజిని పాల్గొన్నారు.

కెఎన్ఎం వృక్ష శాస్త్రం అధ్యాపకురాలు స్వప్నకు డాక్టరేట్

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: స్థానిక కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతున్న రావుల స్వప్నకు రాజస్తాన్ రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయమైన జగదీష్ ప్రసాద్ జబర్మల్ తిబ్రేయాలా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. డాక్టర్ రావుల స్వప్న డాక్టర్ దినేష్‌కుమార్ సింగ్ పర్యవేక్షణలో ఏ స్టడీ ఆన్ స్పెషల్ స్పీసిస్ అవైలబుల్ ఇన్ నేచర్ అండర్ దేర్ ఇంపాక్ట్ ఆన్ డిక్రీజింగ్ ఎయిర్ పొల్యూటెన్స్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధన నిర్వహించి డాక్టరేట్ పట్టాను పొందారు. డాక్టర్ రావుల స్వప్న గత 17 సంవత్సరాలుగా వృక్ష శాస్త్రంలోని తెలంగాణలోని వివిధ డిగ్రీ కళాశాలల్లో వృక్ష శాస్త్రం అధ్యాపకురాలిగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. స్వప్నకు డాక్టరేట్ రావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల భీమార్జున్‌రెడ్డి, అధ్యాపకులు వెంకటరమణ, గుమ్మడి నరేష్, నాగరేఖా రాణి, రవీంద్ బాబు, శివకృష్ణ, అయిన నాగరాజులు శుభాకాంక్షలు తెలిపారు.

కబ్జాపాలైన ప్రభుత్వ భూములను కాపాడాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మండలంలోని అవంతీపురం, గూడేర గ్రామాల శివారులో ఉన్న ప్రభుత్వ భూములను కబ్జాల చెరల నుంచి విడిపించాలంటూ దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మిర్యాలగూడ అధక్షుడు మాడుగుల శ్రీనులు మాట్లాడుతూ ఆలగడప రెవెన్యూ పరిధిలోని అవంతీపురం గ్రామ శివారులోని సర్వే నెం.88లో అదే గ్రామానికి చెందిన ఉప్పుతల మహేష్ అనే వ్యక్తి 4.30ఎకరాల భూమిని, అతని తండ్రి ఉప్పుతల నాగేశ్వర్‌రావు 0.30గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోని కబ్జా చేశారని, అదేవిధంగా గూడూరు గ్రామ శివారులోని సర్వే నెం.629లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి చిమట మదార్ అనే వ్యక్తి ఆక్రమించుకోని దర్జాగా కబ్జా చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలోని కొందరు నాయకుల అండదండలతో అధికారులను మేనేజ్ చేస్తూ దర్జాగా సాగు చేసుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అట్టి భూములపై సర్వే నిర్వహించి కబ్జాలు తొలగించి, భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. అట్టి ప్రభుత్వ భూములను ప్రభుత్వ కార్యాలయాల కోసం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం వినియోగించుకోవాలని, లేదా నిరుపేదలకు పంపిణి చేయాలన్నారు. వారి వెంట తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు మొండికత్తి లింగయ్య, కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర నాయకుడు రెమడాల పరుశురాములు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల బిల్లులు డ్రా చేసుకున్న కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పెండింగ్ లో ఉన్న మాజీ సర్పంచు ల బిల్లులు చెల్లించాలని కలెక్టర్ ఆదేశాలు ఉన్నా కానీ గ్రామపంచాయతీ కార్యదర్శులు బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచులు సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చేసిన పనులకు కలెక్టర్ ఆదేశాలు ఉన్నా ఒక్క రూపాయి. కూడా చెల్లించడంలేదని కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికి లెక్కచేయకుండా ఏకపక్షంగా సర్పంచ్ పెండింగ్ బిల్లులు మొత్తం గ్రామపంచాయతీ కార్యదర్శులు వారి పేరున బిల్లులు డ్రా చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యదర్శులపై వారికి సహకరించిన పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకొని గత సర్పంచ్ ల కాలంలో చేసిన పనులకు బిల్లులుచెల్లించి మాకు న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ వినతిపత్రం సమర్పించిన వారిలో మాజీ సర్పంచులు అంకటి నర్మదా వెంకటరమణ, కేశ శంకర్, పి రమేష్, రాంబాబు,సైదులు,రామలింగమ్మ, రవి,జానయ్య,

నేటి సమాజంలో కరాటే శిక్షణ ఎంతో అవసరం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: నేటి సమాజంలో కరాటే శిక్షణ ఎంతో అవసరమని సినీ నటుడు సుమన్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిలు అన్నారు. సోమవారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో విద్యార్థులకు కరాటే బెల్ట్ సర్టిఫికెట్ల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్, మున్సిపల్ ఛైర్మన్ చిలుకూరి సుధాబాలకృష్ణ, వైస్ ఛైర్మన్ గుడిపాటి శిరీష నవీన్‌లతో కలిసి వారు పంపిణి చేసి మాట్లాడారు. నేటి సమాజంలో విద్యార్థినిలు, మహిళలు కరాటే నేర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. నటుడు సుమన్ మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణానికి తాను 28 సార్లు రావడం చాలా గర్వంగా ఉందన్నారు. మున్సిపల్ ఛైర్మన్ సుధా బాలకృష్ణ మాట్లాడుతూ కరాటే ఆత్మ రక్షణతోపాటు విశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. వైస్ ఛైరమన్ గుడిపాటి శిరీష నవీన్ మాట్లాడుతూ కరాటే నిర్వాహకులు ఎన్నో వందల మందికి కరాటే శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్‌లు బూడిద సైదులు, బాండావత్ రామకృష్ణనాయక్‌లను అభినందించారు. కార్యక్రమంలో 500 మంది విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి వార్డు సభ్యులు కృషి చేయాలి

ప్రజాపక్షం/నకిరేకల్ : గ్రామాల అభివృద్ధికి నూతన వార్డు సభ్యులుఅందరూ ప్రభుత్వ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎంపిడిఓ జె .వెంకటేశ్వరరావు పేర్కొ న్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వార్డు సభ్యులకు శిక్షణ తరగతులును ఆయన ప్రారంభించి మాట్లాడారు.

'బుద్ధునితో నా ప్రయాణం' నాటకం విజయవంతం చేయండి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఈనెల 3న మిర్యాలగూడ కళాభారతిలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి వారు ప్రదర్శించే బుద్ధునితో నా ప్రయాణం నాటకాన్ని ప్రతి ఒక్కరు చూసి విజయవంతం చేయాలని నిర్వాహకులు డాక్టర్ మువ్వా రామారావు, డాక్టర్ జాడి రాజులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక విజేత డిగ్రీ కళాశాల, జ్యోతి ఆసుపత్రిలో నాటకం పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించి వారు మాట్లాడారు. మిర్యాలగూడ పరిసర ప్రాంత ప్రజలు ప్రతి ఒక్కరు ఈ నాటకం చూసి జీవిత సత్యాన్ని తెలుసుకోవాలని బుద్ధుడు చెప్పిన మార్గాలను ప్రతి మనిషి పాటించినట్లయితే సుఖమయ జీవితాన్ని అనుభవించవచ్చన్నారు. కార్యక్రమంలో కస్తూరి ప్రభాకర్, కొండల్‌రెడ్డి, బొప్పని నగేష్, కందుకూరి సుదర్శన్, దేగల వీటి, హరికృష్ణ, మధు, అఖిల్, అజయ్, రఘు పాల్గొన్నారు.

క్రిస్టియన్స్‌కి కో-ఆప్షన్ అవకాశం కల్పించాలి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో కోఆప్షన్ సభ్యుడిగా క్రిస్టియన్స్‌కి అవకాశం కల్పించాలని సియాన్ యూత్ అధ్యక్షుడు దున్న ప్రేమ్ కుమార్ కోరారు.సీయాన్ యూత్ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ని సోమవారం ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు.అనంతరం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో క్రైస్తవులకు అవకాశం కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. మేయర్ ను కలిసిన వారిలో సియాన్ యూత్ ప్రధాన కార్యదర్శి రోషన్ జాకబ్,కోశాధికారి టీ ప్రవీణ్ కుమార్,సభ్యులు అఖిల్, చింటూ,సుమన్ రామన్, జయరాజ్, ప్రశాంత్, సాగర్ జాన్,తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు రాజ్యసభ స్థానం కేటాయించాలి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : కాంగ్రెస్ పార్టీ నుండి మాదిగలకు రాజ్యసభ స్థానం కేటాయించాలని ఎంఎస్‌పి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా కన్వీనర్ ఏపూరి రాజు మాదిగలు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం దేశంలోనే మొట్టమొదలు అమలు చేస్తానని మాట ఇచ్చి నిలబెట్టుకున్నందుకు తెలంగాణ సిఎం రేవంతర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు ఎర్ర వీరస్వామి మాదిగ, ములకలపల్లి రవి మాదిగ, బచ్చలకూరి ప్రసాద్ మాదిగ, ములకలపల్లి మల్లేష్ మాదిగ, మారతంగు రామాంజి మాదిగ పాల్గొన్నారు.

భద్రాచలం సీతారాముల కల్యాణ తలంబ్రాలు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఆర్‌టిసి లాజిస్టిక్ ద్వారా భద్రాచలం సీతారాముల కళ్యాణ తలంబ్రాలు బుక్ చేసుకోవచ్చని డిపో మేనేజర్ సునీత తెలిపారు. సోమవారం ఆర్‌టిసి లాజిస్టిక్ రూపొందించిన గోడపత్రికను ఆమె తన ఛాంబర్లో ఆవిష్కరించారు. ఏప్రిల్ 27న భద్రాచలంలో సీతారాముల కళ్యాణం నేపథ్యంలో, ఏప్రిల్ 31వ తేదీ వరకు ఆర్‌టిసి లాజిస్టిక్ బుకింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సీతారాముల తలంబ్రాలు కావాల్సిన భక్తులు రూ.151 చెల్లించి ప్యాకెట్ బుక్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు సూర్యాపేట/యాదగిరి గుట్ట డిపో పరిధిలోని భక్తులు 9154298695 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎం సైదులు, డిఎంఇ మొహమ్మద్ జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

ఫెయిర్ వెల్ వేడుకలు

ప్రజాపక్షం/నకిరేకల్ : పట్టణంలోని శ్రీ సరస్వతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సోమవారం వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు పాటలు నృత్యాలు నిర్వహించారు పదవ తరగతి విద్యార్థులు తమ జ్ఞాపకాలను అనుభవాలను తోటి విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏవో సురేష్,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీపాదరావు జయంతి వేడుకలు

ప్రజాపక్షం/హాలియా: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం దివంగత మంత్రి దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు హాలియా మున్సిపాలిటీ లో ఘనంగా నిర్వహించారు. సోమవారం హాలియా మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో దుద్దిల్ల శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్, కౌన్సిలర్ ప్రసాద్ నాయక్, చిట్టిపోలు కరుణాసాగర్, నకిరేకంటి సైదులు, ఎడవల్లి రంజిత్, గడ్డం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు సోమవారం కొండమల్లేపల్లి వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ సంయుక్తంగా ఉచితంగా పరీక్ష ప్యాడ్‌లను పంపిణి చేశారు. ఈసందర్భంగా మండల విద్యాధికారి ఆర్. నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి మంచి మార్కులు తెచ్చుకొని పాఠశాలకు పేరు తీసుకురావాలని అన్నారు. ఈకార్యక్రమంలో వాసవి క్లబ్ కార్యదర్శి మారం వెంకటేశ్వర్లు, కోశాధికారి మిర్యాల నగేష్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షులు సముద్రాల స్వప్న, కోశాధికారి దొడ్డి రమ పాల్గొన్నారు.

శ్రీపాద రావు జయంతి

ప్రజాపక్షం/దేవరకొండ; దేవరకొండ పురపాలక సంఘం నందు సోమవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు పున్న వెంకటేశ్వర్లు, మునిసిపల్ మేనేజర్ అర్చన, అసిస్టెంట్ ఇంజనీర్ రాజు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

ఉపాధి హామీని కొనసాగించాలి

ప్రజాపక్షం/మోతె : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కొనసాగించాలని కెకెసి రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మోహన్ నాయక్ అన్నారు. మండలంలోని గోల్‌తండ గ్రామంలో పోస్టర్ ఆవిష్కరణ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద ప్రజలు వలసలను నివారించడానికి యూపిఏ ప్రభుత్వం 2005వ సంవత్సరంలో ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ సారధ్యంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామీణ ప్రాంత ప్రజలకు వంద రోజుల పాటు ఉపాధి కల్పించే విధంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిందన్నారు. అట్టి పథకాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆంక్షలు విధిస్తూ పథకం పేరును మారుస్తూ కొన్ని సవరణలు తీసుకొచ్చి నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధరావత్ భారతి, యలమంచి పాల్గొన్నారు.

ఘనంగా రామానుజాచార్యుల జయంతి

ప్రజాపక్షం/హాలియా: ఎంఆర్‌సి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత హాలియా ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు ముదుంబై రామానుజాచార్యుల 76వ జయంతిని పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. సోమవారం హాలియా ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో రామానుజాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఎంఆర్‌సి. ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు లేని 26 మంది పేద విద్యార్థులకు నూతన వస్త్రలు,74 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండా కృష్ణమూర్తి, రామానుజాచార్యుల సతీమణి మంగతాయారు, ఎమ్మార్సీ ఫౌండేషన్ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, కార్యదర్శి కుకుడాల ఆంజనేయులు, కోశాధికారి మల్ రెడ్డి నాగిరెడ్డి పాఠశాలలో విద్యనభ్యసించిన 1985 నుండి 1992/93 పూర్వ ఎస్ ఎస్ సి విద్యార్థులు షేక్ జలీల్,కాకునూరి వెంకటేశం పాల్గొన్నారు.

శివాలయం అభివృద్ధికి పూర్తి సహకారం

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీ పార్వతి భీమ లింగేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని, మున్సిపల్ పాలక వర్గం తరుపున రూ. 2 లక్షలు మంజూరు చేయిస్తానని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లిఖార్జున్‌రావు లు అన్నారు. సోమవారం శివాలయంలో ఈవో గుజ్జుల కొండారెడ్డి, ఆలయ కమిటి సభ్యులు గజ్జి ప్రభాకర్ ల ఆధ్వర్యంలో మున్సిపల్ పాలకమండలి సభ్యులకు, మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ లకు ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువా గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కోతి సంపత్‌రెడ్డి, వల్లపుదాసు కృష్ణ, యడ్ల విజయ్, నాగలక్ష్మి చంద్రశేఖర్, కవిత బాబురావు, ఉహ సతీష్, అట్లూరి మంజుల హరిబాబు, దొంతిరెడ్డి పద్మారెడ్డి, చెన్నగాని సైదులు, సుష్మా, సావిత్రి, భద్రమ్మ పాల్గొన్నారు.

శ్రీ పార్వతీ శ్రీ రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

ప్రజాపక్షం/చండూరుః చండూరు మండల పరిధిలో ప్రసిద్ధి గాంచిన తుమ్మలపల్లి గ్రామంలోని శ్రీ పార్వతీ శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవముల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి శ్రీ పార్వతీ శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణం ఆలయ కమిటీ చైర్మన్ గుండ్రెడ్డి రమ్యా రామలింగారెడ్డి ఆధ్వర్యంలో అత్యంత అంగరంగ వైభవంగా వేదమంత్రోచ్చారణల నడుమ నిర్వహించడం జరిదింది. పార్వతీ రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అరుణ దంపతులు పట్టు వస్త్రాలను , తలంబ్రాలను దప్పు చప్పుల్లతో కళ్యాణ మండపానికి తీసుకొచ్చి కళ్యాణమును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుండ్రెడ్డి రమ్యా రామలింగారెడ్డి, ఆలయ కార్యనిర్వాహణ అధికారి అంబటి నాగిరెడ్డి, ఆలయ దర్మకర్తలు బోయపల్లి రాములు గౌడ్, జిల్లా నర్సింహ్మా, కురుపాటి వెంకటమ్మ ముత్తయ్య, కారువంగ నర్సింహ్మా శర్మ, కారువంగ తిరుపతయ్య శర్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ , మాజీ ఎంపిపి తోకల వెంకన్న, పుల్లెంల సర్పంచ్ ముక్కముల వెంకన్న, పల్లె వెంకటేశం పాల్గొన్నారు.

దేవాదుల నీటిని గుండాల మండల వ్యాప్తంగా అందించాలి

ప్రజాపక్షం/గుండాల; దేవాదుల నీటిని గుండాల మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు అందించాలని భారతీయ జనతా పార్టీ గుండాల మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ హరికృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు విజయ్ రెడ్డి మాట్లాడుతూ గుండాల మండల వ్యాప్తంగా అన్నిగ్రామాలలో త్రాగు, సాగు నీటికి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, దేవాదుల ప్రాజెక్టు నీరు అందుబాటులో ఉన్నప్పటికి మండలంలోని అన్ని గ్రామాలకు సమానంగా నీరు సరఫరా జరగడం లేదన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ నాగయ్య, మండల కార్యదర్శి కృష్ణ, బిజెఐఎం నాయకులు సోమరాజు, నర్సింహా, బాలయ్య, ఎల్లయ్య, శ్రీను, సురేష్ ఉన్నారు.

ఆచార్య అంజిరెడ్డికి ఘన సన్మానం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: మహాత్మా గాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా నూతనంగా నియమితులైన ఆచార్య కొప్పుల అంజిరెడ్డిని సోమవారం విశ్వవిద్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సిబ్బంది ప్రతినిధులు అయిత రాజు శంకర్,కొమరవెల్లి రామ్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.నూతన బాధ్యతలు స్వీకరించిన రిజిస్ట్రార్ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. సిబ్బంది మాట్లాడుతూ యూనివర్సిటీలో ఎదుర్కొంటున్న పరిపాలనా,సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, శ్రీను,కిరణ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ యోగ గురువుగా గోల్డెన్ నంది అందుకున్న పాపిరెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఉత్తమ యోగ గురువుగా గోల్డెన్ నంది అవార్డును సూర్యాపేటకు చెందిన చాడ పాపిరెడ్డి అందుకున్నారు. మెగా హెల్పింగ్ ఫౌండేషన్ మెగా ఈవెంట్స్ ఉగాది పురస్కరించుకొని హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియంలో అవార్డుల ప్రోగ్రాం నిర్వహించారు. మెగా హెల్పింగ్ ఫౌండేషన్, మెగా ఈవెంట్స్ ఎండి ఆర్గనైజర్ శిరీష రెడ్డి, మాజీ మంత్రి, ప్రముఖ సిని నటుడు బాబుమోహన్, అంబికా కృష్ణ, మాజీ మంత్రి వేణుగోపాల్ చేతుల మీదుగా ఆయనకు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పాపిరెడ్డిని తెలంగాణ యోగ ప్రచార సమితి అధ్యక్షులు ప్రసాద్‌తోపాటు పలువురు మిత్రులు అభినందించారు.

మున్సిపల్ చైర్మన్ పరామర్శ

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: మున్సిపాలిటి పరిధిలోని 16వ వార్డుకు చెందిన కుక్కడపు లింగయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్ కుక్కడపు లింగయ్యను పరమార్శించి చికిత్స పొందుతున్న విధానంను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్ వల్లపుదాసు కృష్ణ, మాజీ కౌన్సిలర్ కారింగుల విజయ వెంకటేశ్వర్లు, న్యాయవాది కుక్కడపు నర్సింహరావు, యూత్ కాంగ్రెస్ లీడర్ మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ ఆశయం

ప్రజాపక్షం/చండూరుః ఏ ఆసరా లేని నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ ఆశయమని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. రెండు సంవత్సరముల వరకు ప్రతి నెల 30మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాలయల విలువ చేసే నిత్యవసర సరుకుల పంపిణీ చేయాలనే లక్ష్యంతో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ,గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు 2024 జనవరిలో ప్రారంభించిన నిరుపేదలకు నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 27వ నెల నిత్యవసర సరుకుల పంపిణీని సోమవారం నిరుపేదలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యా సంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ భార్గవ్ , పులిపాటి రాధిక, బుషిపాక యాదగిరి, బోడ విజయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

హోళీ శుభాకాంక్షలు

ప్రజాపక్షం/దేవరకొండ; దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ హోళీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అందరి జీవితాల్లో నిత్య వసంతం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. సహజ సిద్ధమైన రంగులతో హోళీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

కరెంటు ఓవర్ లోడ్ సమస్యను పరిష్కరించాలి

ప్రజాపక్షం/గుండాల; కరెంట్ ఓవర్ లోడ్ సమస్యను పరిష్కరించి, కోతలు లేని నాణ్యమైన కరెంటును ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు మద్దెపురం రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గుండాల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోత్కుర్ మండలం బుజిలాపురం 132/11కేవి సబ్ స్టేషన్ ఉప కేంద్రం నుండి గుండాల మండలానికి విద్యుత్ సరఫరాలో ఓవర్ లోడ్, సాంకేతిక కారణాల వల్ల గత వారం రోజులుగా గంటల తరబడి కరెంటు సక్రమంగా రావడం లేదని, విద్యుత్ శాఖ సిబ్బంది వినియోగదారులకు జవాబుదారీగా పని చేయాలని కోరారు.

హద్దు దాటితే చర్యలు

ప్రజాపక్షం/మర్రిగూడ: హోళీ పండుగను ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ కృష్ణారెడ్డి సూచించారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి గొడవలు సృష్టిస్తే సహించేది లేదని, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని హెచ్చరించారు.ముఖ్యంగా రోడ్లపై వెళ్లే వాహనదారులు, బాటసారులపై బలవంతంగా రంగులు చల్లకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ముందస్తు హోళీ సంబరాలు

ప్రజాపక్షం/నూతనకల్ : మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు రంగులు పూసుకుని హోలీ పండుగ జరుపుకున్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్ గౌడ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేసే దిశగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మారగాని విజయలక్ష్మి, ఉపాధ్యాయులు గుర్రం యాదగిరి గౌడ్, ముగుళ్ల వెంకటనారాయణ, బిక్కి రామన్న, మహ్మద్ మథిన్, నల్లగొండ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యులకు శిక్షణ

ప్రజాపక్షం/నూతనకల్ : మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఎన్నిక కాబడిన వార్డు సభ్యులకు జనరల్ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సోమవారం ఎంపిడిఓ సునీత తెలిపారు. ఈనెల 4 నుండి 8వ తేదీ వరకు 5 రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి అలుగునూరు, పెదనెమిల, బిక్కుమళ్ళ, ఎర్రపహాడ్, దిర్శనపల్లి, కొత్తతండ, లింగంపల్లి, మాచినపల్లి, మిర్యాల గ్రామ పంచాయితీలకు చెందిన వార్డు సభ్యులందరికి ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వార్డు సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

విద్యార్థులే... ఉపాధ్యాయులు అయిన వేళ

ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :మండల పరిధిలోని శ్రీరాంపురం గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల శ్రీరాంపురం లో ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఫరీద్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ హోదాల్లో విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు మండల విద్యాధికారిగా యశస్విని, ఎంపీడీవో గా గౌతమి, తహసిల్దారుగా జ్ఞానేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా శ్రవణ్, ఉపాధ్యాయులుగా అభి,రోహన్, కార్తీక్,జాన్, అంజలి, రిషిక,జాన్ పీటర్,దిలీప్ ఒకరోజు పరిపాలన కొనసాగించారు.

ప్రజాపక్షం/నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలోని ఎస్పిఆర్ పాఠశాలలో సోమవారం ఘనంగా స్వపరిపాలన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఓగా గజియా తబాసం, ఎంఈఓగా శ్రీవిద్య,కలెక్టర్ గా ఏ.అనన్య, ఎస్పిగా కే.ఉమాశ్రీ,డిజిపిగా బి.చందన,చీఫ్ సెక్రటరీగా కె.శ్రీ రియా,ఆర్టిఓ గా ఎం.ఝాన్సీ, జాయింట్ కలెక్టర్ గా కే.పూజిత బాధ్యతలు నిర్వర్తించారు.అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఆలేరు టిపిఒను సస్పెండ్ చేయాలని ధర్నా

ప్రజాపక్షం/ఆలేరు : ఆలేరు మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారి ఇళ్ల నిర్మాణ అనుమతులలో అవక తవకలుకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయనపై వెంటనే విచారణ జరిపించి సస్పెండ్ చేయాలనీ డిమాండ్ చేస్తూ భరత్ నగర్ కాలనీ ప్రజలు సోమవారం ఆలేరు మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 8వ వార్డులో నూతనంగా ఇల్లు నిర్మాణం చేస్తున్న వ్యక్తి రోడ్డును ఆక్రమించుకొని ఇల్లు నిర్మాణం చేస్తున్న విషయమై మున్సిపాలిటీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసేప్పటికీ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. లేని యెడల మున్సిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి ఫిర్యాదు కాపీని అందజేశారు. ఈ కార్యక్రమంలో జంపాల దశరథ, ఎగ్గిడి సంపత్, ఎగ్గిడి శ్రీనివాస్, చీర శ్రీనివాస్, ఎగ్గిడి పుల్లయ్య, మైల వెంకటేష్, కటకం హరి, కటకం విజయ్, బేతి గణేష్,దయ్యాల సంపత్, ఉమా,లక్ష్మి బాలమని, విమల తదితరులు పాల్గొన్నారు.

కొడుకు గెంటేశాడు...

గూడు కల్పించండంటూ వృద్ధురాలి ఆవేదన

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : కష్టపడి పెంచిన కొడుకు తాను రూపాయి రూపాయి పోగు చేసి సంపాదించిన ఆస్థిని అక్రమంగా రాయించుకొని తనను ఇంటి నుంచి గెంటేసి తనకు గూడు లేకుండా చేశాడని తనను ఆదుకోవాలని మద్దిరాల మండలం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన 76 ఏండ్ల వృద్ధురాలు గంగుల రమణమ్మ అధికారులను వేడుకుంది. సోమవారం స్థానిక రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ తనకు కుమారుడు, కుమార్తె ఇద్దరు ఉన్నారని తెలిపారు. కాయాకష్టం చేసి తాను సంపాదించిన ఎ.3 10గుంటల వ్యవసాయ భూమి, గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు ఉందన్నారు. కుమారుడు ప్రభాకర్ ఎస్బిఐలో మేనేజర్గా ఉద్యోగం చేస్తూ తన కున్న రెండకరాలను రాయించుకున్నాడని, ఉన్న 1.10 గంటల భూమిని భర్త లేని తన కుమార్తెకు తాను రాసి ఇవ్వకుండానే ఇచ్చానని భ్రమపడి తనను ఇబ్బందుల పాలు చేస్తున్నాడని ఆరోపించారు. భర్త లేని నా బిడ్డ నా వద్ద ప్రభుత్వం ఇచ్చిన ఇంట్లో ఉంటుంటే నన్ను, నా బిడ్డను ఇంట్లో నుంచి గెంటేసి తాళం వేశాడన్నారు. తాను గ్రామంలో కరువు పనికి వెళ్తూ వచ్చిన భూమి కౌలుతో నేను నా బిడ్డ కాలం వెల్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ కూడా తన కుమారుడు తమను పట్టించుకోకుండా మా ఇంటి నుంచి మ మ్ముల్ని గెంటేశాడని తన కోడలు నానా దుర్భాషలాడుతూ ఇబ్బందుల పా లు చేస్తుందని అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు.

లింగం వారి గూడెం గ్రామ సభలో రభస

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : సంస్థాన్ నారాయణపురం మండలం లింగం వారి గూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభ ఉద్రిక్తత వాతావరణంలో సాగింది. గతంలో అభివృద్ధి పనుల పేరుతో వచ్చిన నిధుల వినియోగంపై స్పష్టత ఇవ్వాలని వార్డు సభ్యులు, గ్రామస్తులు అధికారులను నిలదీశారు. గ్రామానికి వచ్చిన నిధులు, అభివృద్ధి పనులలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెలువత్తాయి. ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన సర్పంచ్ కాకుండా ఆమె భర్త, వాసు మామ, శంకరయ్య జోక్యం చేసుకొని మమ్మల్ని లెక్కలు అడుగుతావా అంటూ వివరాలడిగిన యువకులను బెదిరిస్తూ గ్రామ సభలో హంగామ చేశారు. అంతేకాకుండా గ్రామపంచాయతీ కార్యదర్శి వత్తాసు పలకడం విశేషం. సభలో సరియైన సమాధానం రాకపోవడంతో కొందరు వార్డు సభ్యులు గ్రామసభను బహిష్కరించారు. గ్రామ సభలో జరిగిన ఈ రభస స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

రాహుల్ గాంధీతో కైలాష్ భేటీ

ప్రజాపక్షం/మునుగోడు: నల్లగొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత సోమవారం నాడు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. వికారాబాద్లోని హరిత రిసార్ట్స్లో ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం ముగింపు సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరయ్యారు.ఈ సందర్భంగా డీసీసీ జిల్లా అధ్యక్షులు పున్న కైలాష్ నేత తన కుటుంబ సభ్యులతో కలిసి సమావేశానికి హాజరై రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షులు బలంగా పనిచేయాలన్నారు. కైలాష్ నేత కుమారుడు జయంత్ విక్రమ్, రాహుల్ గాంధీ ఛాయాచిత్రంతో కూడిన జ్ఞాపికను అందజేశారు.

'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమం

ప్రజాపక్షం/దేవరకొండ; దేవరకొండ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం దేవరకొండ గర్ల్స్ హై స్కూల్ నందు బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపివో శ్రీమతి చంద్రకళ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. బాల్య వివాహాల వల్ల విద్య ఆగిపోతుంది, ఆరోగ్య సమస్యలు వస్తాయి, భవిష్యత్తు నాశనం అవుతుందని అన్నారు. ఎక్కడైన బాల్య వివాహం జరిగే పరిస్థితి ఉంటే వెంటనే 1098 హెల్ప్లైన్ నెంబర్కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ చిట్టెమ్మ, ఉపాధ్యాయు లు, అంగన్వాడీ టీచర్లు మణేమ్మ, సుశీల విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఇరాన్పై అమెరికా-ఇజ్రాయిల్ సంయుక్త దాడిని ఖండించాలి

ప్రజాపక్షం/నకిరేకల్ : ఇరాన్పై అమెరికాఇజ్రాయిల్ సంయుక్త దాడులను తక్షణమే నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు యం. దేవిడ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నకిరేకల్ పట్టణంలోని ఇందిరాగాంధీ చౌరస్తాలో పార్టీ ఆధ్వర్యంలో అమెరికా దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదానికి ఇతర దేశాలపై దాడి చేసే హక్కు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి అంబటి చిరంజీవి,రైతుకూలీ సంఘం జిల్లా కోశాధికారి గజ్జి రవి,నాయకులు పుట్ట సత్తయ్య, అంబటి నరసయ్య పాల్గొన్నారు.

అధ్యాపకురాలు మిస్కిన్ తరన్నకు డాక్టరేట్ పట్టా ప్రదానం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగంలో ఒప్పంద అధ్యాపకురాలిగా సేవలందిస్తున్న మిస్కిన్ తరన్నకు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన జగదీష్ ప్రసాద్ ఝాభార్మల్ టిబెరేవలా యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా ప్రదానం చేసింది.ఆమె ప్రొఫసర్ డాక్టర్ ఇమ్రాన్ ఖాన్ పర్యవేక్షణలో జెనెటిక్ రిసోర్సెస్ అండ్ కన్జర్వేషన్ ఆఫ్ మేజర్ కార్ప్స్ ఇన్ సౌత్ ఇండియన్ రీజియన్ అండ్ ఇట్స్ డిస్ట్రిబ్యూషన అనే ప్రాముఖ్యమైన అంశంపై విస్తృత పరిశోధన నిర్వహించారు.ఈ పరిశోధనలో దక్షిణ భారతదేశంలోని ప్రధాన కార్ప్ చేపల జన్యు వనరులు,వాటి వైవిధ్యం, భౌగోళిక విస్తరణ, సంరక్షణ అవసరాలు వంటి అంశాలను లోతుగా అధ్యయనం చేసి శాస్త్రీయ ఆధారాలతో కూడిన సమగ్ర విశ్లేషణను సమర్పించారు.డాక్టరేట్ సాధించిన సందర్భంగా సోమవారం నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫసర్ డాక్టర్ కె. శ్రీనివాసరాజు, గ్రంథాలయాధిపతి డాక్టర్ సుంకరి రాజారాం, జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ చి.సమత,డాక్టర్ కె. వనజ, డాక్టర్ మల్లేష్, వైష్ణవి, సంతోష్ కుమార్ తదితర అధ్యాపకులు ఆమెను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

హోలీ సంబరాలు

ప్రజాపక్షం/తుర్కపల్లి : మండలంలోని ములకలపల్లి గ్రామ పరిధి విశ్వభారత్ గ్లోబల్ స్కూల్లో సోమవారం హోలీ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు రంగులు పూసుకొని పండుగను రంగుల సందడిగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, శైలజ, రమలీల, రాజేశ్వరి కల్పన, శిరీష, స్వీటీ రెడ్డి, కవిత, నవనీత, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాపక్షం/తుర్కపల్లి : మండలంలోని గంధమల్ల గ్రామంలో సోమవారం ప్రారంభమైన సిసి రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ బొత్త రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇమ్మడి బాలరాజు, వార్డు సభ్యులు గడిపే నరసింహులు, జెల్ల గణేష్, దానబోయిన చందు, గ్రామ శాఖ అధ్యక్షుడు జింకల ఎల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాపక్షం/తుర్కపల్లి : మండలంలోని గోపాలపూర్ గామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పుట్ట సాయిలు ఆధ్వర్యంలో మెడిసిటీ హాస్పిటల్, ఘనపూర్, మేడ్చల్ ఆధ్వర్యంలో సోమవారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిభిరంలో బీపీ, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు చెవి, ముక్కు, గొంతు వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, కనథులు, థైరాయిడ్ గడ్డలు, గర్భసంచికి సంబంధించిన సమస్యలకు పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీ అందించే వ్యాధులకు హాస్పిటల్ తీసుకొనివెల్లి చికిత్స అందించబడుబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండబోయిన శ్రీశైలం, వార్డ్ సభ్యులు కాశబోయిన కనకమ్మ, పుట్ట గీతా నారం కృష్ణవేణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలరాజ్ పాల్గొనారు.

గ్రామశాఖ అధ్యక్షుడిగా రవీందర్ నాయక్

ప్రజాపక్షం/తుంగతుర్తి : మండలంలోని రామన్నగూడెం గ్రామ పంచాయితీ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులుగా గుగులోతు రవీందర్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా గాజుల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా లకావత్ సోములు నాయక్, కోశాధికారిగా గుగులోతు వీరు నాయకులను ఎన్నుకున్నారు. శ్రీసంతు సేవాలాల్ మహారాజ్ జిల్లా నాయకులు గుగులోతు దీప్లా నాయక్, సర్పంచ్ గుగులోతు రాజశేఖర్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : మున్సిపల్ కార్పొరేషన్ ను అందరి సహకారంతో సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడం జరుగుతుందని నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మీరు బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు.నలగొండ క్లబ్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించి నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, స్థానిక 13వ డివిజన్ కార్పొరేటర్ గుమ్ముల జానకి మోహన్ రెడ్డితో పాటు క్లబ్ లో మెంబర్షిప్ గా ఉండి కార్పొరేటర్లుగా ఎన్నికైన యామ కవితా దయాకర్, ఏదుళ్ల శ్రీధర్ రెడ్డి, గంట్ల అనంతరెడ్డి, మారగోని నవీన్ కుమార్ గౌడ్ ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లగొండ మేయర్ గా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, నల్లగొండ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ గోలి అమరేందర్ రెడ్డి, డాక్టర్ పుల్లా రావు, సుధారాణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లిలో రైతు మహా ధర్నా రాస్తా రోకో

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు మహా ధర్నా రాస్తా రోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలం అయిందన్నారు. యాసంగి పంటకు సకాలంలో యూరియా సరఫరా చేయకుండా యాప్ ద్వారా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. పంట పెట్టుబడి సాయం కింద రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాలో జమ చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రైతుల ద్రోహి అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తుక్కాపురం సర్పంచ్ జనగాం పాండు, బిఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నీల ఓంప్రకాష్ గౌడ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు జక్కా రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

రహదారులపై క్రమశిక్షణ

ప్రజాపక్షం/చింతలపాలెం : హోలీ పండుగ సందర్భంగా ఉత్సవం జరుపుకునే వారు ప్రమాదాలకు దూరంగా ఉంటూ సంతోషకరమైన వాతావరణంలో కలిసిమెలిసి జరుపుకోవాలని చింతలపాలెం ఎస్ఐ సందీప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రహదారులపై క్రమశిక్షణతో ఉండాలని, రంగులు చల్లుకునే సమయంలో పరిసరాలను గమనించాలని కోరారు. రంగులు ఇష్టపడని వ్యక్తులపై బలవంతంగా రంగులు చల్లవద్దని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపకూడదని కోరారు.

4న అమ్మవారి జాతర

ప్రజాపక్షం/చింతలపాలెం : మండల కేంద్రంలో దొండపాడు గ్రామం నందు శ్రీతిరుపతమ్మ అమ్మవారి 23వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 4న తిరుణాల జాతర, కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటి చైర్మన్, సర్పంచ్ చెన్నకేశవ వెంకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి జాతర నందు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఒంగోలు జాతి కోడెల బలప్రదర్శన, మహిళలకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు కలవు.

బియ్యం పంపిణీ

ప్రజాపక్షం/తుర్కపల్లి : మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కొడపాక పుట్టలయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, బీర్ల పౌండేషన్ నుండి 50 కిలోల బియ్యాన్ని పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రే మాధవి కరుణాకర్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు రాగుల శ్రీనివాస్, వార్డు సభ్యులు నారా నాగరాజు, కొడపాక మహేష్ పాల్గొన్నారు.

రాహుల్ గాంధీని కుటుంబంతో కలిసిన బీర్ల

ప్రజాపక్షం/యాదాద్రి : వికారాబాద్‌లోని హరిత రిసార్ట్‌లో జరుగుతున్న 'ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సంఘటన్ సృజన్ అభియాన్' జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి రాహుల్ గాంధీని కలిసి ప్రత్యేకంగా ఫోటో దిగారు. శిక్షణ శిబిరం ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాహుల్ గాంధీతో జరిగిన ఈ భేటీలో పార్టీ బలోపేతం, భవిష్యత్ రాజకీయ పరిణామాలు, ప్రజా సేవలో నాయకుల పాత్ర వంటి కీలక అంశాలపై సానుకూల చర్చలు జరిగినట్లు సమాచారం. అయిలయ్య కుటుంబ సభ్యులను రాహుల్ గాంధీ ఆత్మీయంగా పలకరించడం, ఫోటో దిగడం వారి జీవితంలో మరువురాని అనుభూతి అని పేర్కొన్నారు.

మూఢనమ్మకాలను వీడి గ్రహణం వీక్షించండి

ప్రజాపక్షం/నకిరేకల్ : పున్నమి రోజుల్లో సంభవించే చంద్రగ్రహణం ఒక సహజ ఖగోళ ప్రక్రియ మాత్రమేనని, దానికి అంధవిశ్వాసాలతో సంబంధం లేదని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్ స్పష్టం చేశారు. ప్రజలు మూఢనమ్మకాలు విడిచిపెట్టి ఖగోళ అద్భుతాలను శాస్త్రీయ దృష్టితో వీక్షించాలని పిలుపునిచ్చారు.

స్కూల్ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాపక్షం/బీబీనగర్ : మండల కేంద్రంలో రాక్‌క్వుడ్ పాఠశాలకు చెందిన బస్సు ఢీకొని ఇరువురికి గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. సీఐ ప్రభాకర్ రెడ్డి తెలిపిన విరాల ప్రకారం ఇందిరమ్మ కాలనీకి చెందిన మచ్చ చంద్రయ్య తన టీవీఎస్ వాహనంపై ఇట్టబోయిన దివ్య అనే అమ్మాయిని ఎక్కించుకొని ఫ్లైఓవర్ నుండి వెళ్తుండగా రాక్‌క్వుడ్ బస్సు డ్రైవర్ అతివేగంగా వచ్చి టీవీఎస్ వాహనాన్ని ఢీకొనడంతో చంద్రయ్య దివ్య అనే ఇరువురికి తీవ్ర గాయాలైనట్లు సిఐ తెలిపారు. గాయాలైన చంద్రయ్యను ఎయిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తీవ్ర గాయాలైన దివ్యను సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు సిఐ తెలిపారు. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్ చేసినట్లు సిఐ తెలిపారు.

నేషనల్ మెరిట్ స్కాలర్షిప్‌కు శ్రీసహస్రీ

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : పోచంపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థిని శ్రీసహస్రీ నేషనల్ మెన్స్ మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపిక అయినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4 సం.ల పాటు ప్రతి ఏటా రూ.12 వేలు విద్యార్థినికి ఉపకార వేతనం కింద రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు విజయం సాధించిన బాలికకు పాఠశాల ఉపాధ్యాయులు పేరెంట్స్, టీచర్స్ చైర్మన్ అభినందించి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

పోలీస్ కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/ఆత్మకూరు (ఎం) : మండల కేంద్రంలో ఫిబ్రవరి 26న మహబూబాబాద్ నుండి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రయాణికుడిపై, వారి అమ్మ పై దాడిచేసిన కానిస్టేబుళ్లను తక్షణమే సస్పెండ్ చేయాలని, చట్టపరంగా శిక్షించాలని బాదితులతో కలసి ఎమ్మార్పియస్, బీసీ సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకి ఫిర్యాదును అందజేశారు. ఈ కార్యక్రమంలో బాదితులు ధర్మారపు శ్రీశైలం, ధర్మారపు రామక్క, ఎమ్మార్పియస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్రస్వామి మాదిగ, ఆత్మకూరు(ఎం) ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేశం పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/కోదాడ రూరల్ : మండలంలోని అడ్లూరు గ్రామంలో మెయిన్ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ శిరీష వెంకట్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మెయిన్ రోడ్డు గుంతలమయంగా మారిందని, రోడ్డు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్ రెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : మండలంలోని దోసపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాల యందు స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వలపట్ల సైదమ్మ లింగయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని భావితరాలకు ఆదర్శం కావాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వరికుప్పల రాము, ప్రధానోపాధ్యాయులు పిండిగ నర్సయ్య, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు మామిడి వెంకన్న, పంచాయితీ కార్యదర్శి జానీవర్మ, కె కళ్యాణి పాల్గొన్నారు.